● ఈవారం కథ

# అమలినం

— బమ్మి రమేష్‌బాబు

**మనసు మనసుతో కలబడుతున్నవేళ,**
**మానవ సంబంధాల్ని అపహాస్యం చేస్తున్న చోట –**

"ఆకలేస్తోందిరా! ఒరే ఆకలేస్తోంది" ప్రాణం పెనుగు లాడుతున్నట్టు, ఎక్కడో పాతాళం లోంచి, కీకారణ్యపు చిక్కని చీకట్ల లోంచి, జీబురు గుహల లోంచి, అఖాతాల అట్టడుగు పార ల్లోంచి పెకలించుక వచ్చినట్టు సన్నని కేక. వినబడీ వినబడనట్టు తన్లో తనే మాట్లాడు కొంటున్నట్టు దీనంగా అర్థిస్తున్నట్టు –

బిగదీసిన తంత్రులన్నీ ఫెటేల్లున తెగినట్టయి, చెళ్ళున ఎవరో చర్నకోల రువ్వినట్టయి కంపించి పోయాడు సాంబు. జేవురించిన ముఖాన్ని రెండు చేతులతోనూ తడుము కున్నాడోసారి. రాజమండ్రి పట్టణంలో రద్దీగా వుండే మెయిన్ రోడ్‌ని ఆనుకొని రేయింబవళ్ళా తలుపులు బార్లా తెరిచిన వేశ్యావాటికలా వుంది ఇసుక వీధి. వీధి మొగని వృద్ధ కన్యలా నిలబడి దిక్కులు చూస్తున్న పాడుబడిన పెంకుటిల్లు. అరుగుమీద నులక మంచంపై కదల్లేక మూల్గుతోంది ముత్యాలమ్మ. కొంచెం కొంచెం శిథిలమౌతున్న రోగిష్ఠి దేహం. ఇక్కడే ఈ లక్క పిడతల్లాంటి వెలుతురు చొరబడని గదుల్లోనే ఏళ్ళ తరబడి ఎందరి చేతుల్లోనో నలిగి మల్లె పూవల్లే వాడిలిపోయిన దేహం. వయసు పెరిగి, అవయవాలలో బింకం సడలి, బాగుపడని రోగాల్ని మిగుల్చుకొని, లోపల్లోపల వీచే చలిగాలుల తాకిడికి తాళలేక బిగుసుకపోతూ –

"ఆకలేస్తోందిరా! ఒరే, ఆకలి" లో గొంతుకలోంచి, కదిలీ కదలని పెదాల నుండీ బలవంతాన వెలువడిన ముత్యాలమ్మ హీనస్వరం. ప్రాణంతో కుస్తీ పడుతున్నట్టు ఎగవూపిరి, ఎగిరిపడే డొక్కలు. బయటికి పొడుచుకొచ్చి అసహ్యంగా కనిపిస్తున్న పక్క టెముకలు. చింకిరి ముతక చీరని పైన కప్పుకొని.

ముత్యాలమ్మ పడుకున్న అరుగు కెదురుగా తన రిక్షాలో ముణగదీసుకొని కూర్చున్న సాంబు విస్సత్తువతో వాణికేడు. ఆకలేస్తోందన్న ముత్యాలు కేక పెనుగాలులతో దొమ్మీకి దిగిన భీకర తుఫానల్లే హోరు మంటో వినిపిస్తోందతనికి. అక్కడికి సమీపంలో వున్న గోదావరి స్టేషన్ నుండి విన్పించే రైలు కూతని చీల్చుకొని, గోదావరి గట్టమ్మడి బరువుగా రొద చేసుకొంటూ తిరిగే ఇసుక లారీల మోతని చీల్చుకొని, నేరుగా కర్ణభేరీని ముట్టు ముట్టి చావు బాజాలు తెగవాయించి నట్టు – సాంబుడి చుట్టూ ఆకలి కేకలు. గుండెల్లోంచి ఒక్క పెట్టు న దుఃఖం పొర్లినట్టయి అప్రయత్నంగా కళ్ళు తడుము కున్నాడు. రెండు కళ్ళూ రెండు చితాభస్మరాశుల్లా గరుగ్గా ఎంత తడివినా తడి తగల్లేదు. ఎడతెగని ఎడారి లాంటి జీవితం. ఆశతో, దాహంతో ఎండమావుల వెంట పరుగులతోనే నలభై ఐదు వేసవులు వెళ్ళిపోయాయి – ఒగర్చు కొంటో, ఓపిక కూడగట్టు కుంటో తన బలహీనమైన చేతులవొంక, మురికి గుడారం లాంటి రిక్షావొంక ఒకసారి రోతగా చూసుకున్నాడు. ఖాళీ జేబుల వెక్కిరింపు. అనావృష్టి బతుకు.

చలికాలపు ఉదయం ఎండ మలివెచ్చగా మెరుస్తోంది. ఇసుక వీధి ఎప్పుడూ జన సమ్మర్దంగా వుండదు. సాయంత్రాలు మాత్రం


## ● ఫ్లెమింగ్ ఆలో

పెన్సిలిన్ మందు 'వండర్ డ్రగ్'గా ప్రపంచ ప్రసిద్ధమై, కోట్లమందికి ప్రాణదానం, బాధా విముక్తం చేసింది.

ఆ మందు కనిపెట్టిన అలెగ్జాం డర్ ఫ్లెమింగ్ గొప్ప శాస్త్రవేత్తగా గుర్తించబడ్డాడు. ఇలా పెన్సిలిన్ మందుతో ప్రసిద్ధమైన అలెగ్జాం డర్ ఫ్లెమింగ్ తరువాత అనేక ప్రయోగాలు చేస్తూ ఎప్పుడూ తన శాస్త్ర విషయాలుగా, తల మునకలైవుండి, ఎప్పుడూ పత్రికా విలేకరులకు దూరంగా వుండేవాడు.

ఒకసారి అలెగ్జాండర్ ఫ్లెమింగ్ ఒక హోటల్‌లో అతిథిగా వుండి, భోజన సమయానికి భోజనశాలకు వెళ్లాడు.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ ఆ హోట ల్‌లో వున్న సంగతి కనిపెట్టిన ఇద్దరు పత్రికా విలేకరులు ఆయనను ఏదో వింత ప్రశ్న వేసి సమాధానం రాబట్టాలని ఆలోచించి, తమను



బేరాలకి లోటుండదు. కేవలం దేహాల రాపిడి కోసం వెంపర్లాట. ఖరీదుకి విరివిగా సుఖం. నలిగీ, చిల్లులుపడీ ఒకరు బాధతో అల్లాడుతుంటే, మత్తెక్కి, తూలి, అరమూసిన కన్నుల సుఖంతో మరొకరు ... పశుత్వంతో కుమ్మే మగతనం ముందు హృదయ విదారకమైన మూగతనం.

'ఉదయమే ఎక్కడ దొరుకుద్దీ బేరం!' అసహనంగా అటూ ఇటూ చూసేడు సాంబు. 'ముత్యాలమ్మ రెండు రోజులయి మంచి నీళ్ళైనా తాగిందో లేదో?' మొన్న రాత్రతనగా కొత్తగా వచ్చిన ఎస్సై దగ్గర మెప్పు పొందడం కోసం అకారణంగా సాంబుని స్టేషన్‌కి లాక్కుపోయారు కానిస్టేబుళ్ళు. తనలాంటి మరికొందరు బ్రోకర్లు, చిల్లర దొంగలతో కలిపి రెండు రాత్రులూ, ఒక పగలు నిర్దాక్షిణ్యంగా లాకప్పు ఊచలు లెక్క బెట్టించేరు. పెద్దగా అడిగిన వివరాలేవీ లేవు, కొత్త ఎస్సై ముఖం చూడ్డం తప్ప. పోలీసుల చదరంగంలో తానొక పావు. ఈ రోజు ఉదయమే బ్రతిమిలాడకుండానే వొదిలిపెట్టేరు. స్టేషన్‌కి రావడం సాంబుకి అలవాటే. ఎన్నాళ్ళుంచినా కష్టమనిపించేది కాదు. ముత్యాలమ్మని కనిపెట్టుకునుండే వాళ్ళు లేక ఈసారే బెంగనిపించింది. రెండు వారాల నుండీ ఎటూ కదల్లేకుండా ఒక్కలా ఆయాసపడ్తో నరక యాతన అనుభవిస్తోంది. అన్నం కూడా సయించడం లేదు. ఒకప్పుడు మహారాణిలా బతికిన మనిషి. ఒళ్ళమ్ముకుంటేనేం, ఒకడికి తలొంచని మనిషి.

"దాహంరా! ఒరే, కాస్త గొంతు తడపరా!" మెడని ఒకింత పైకెత్తి రెప్పలలో కొనవూపిరితో వెలుగుతున్న కళ్ళని లీలగా సాంబుడి వైపు తిప్పింది ముత్యాలు. 'ఆ కళ్ళకి కన్పించానో లేదో' అనుకున్నాడు సాంబు. మూలుగుల్లోంచి వ్యాపిస్తున్న బాధని పళ్ల బిగువున అణుచుకొంటూ అల్లాడిపోతోంది. లీలగా వెదుక్కునే ఆ కళ్లలో సారాయి చుక్క కోసం ఆరాటం. సారాయి చుక్కతో తాత్కాలికంగానైనా బాధని ఉపశమింప చేసుకోవాలన్న ప్రయాస. ముత్యాలు పడుతున్న యాతన చూళ్లేక కళ్లు తిప్పుకున్నాడు సాంబు. అంతా ఖాళీ జేబుల వెక్కిరింపు.

మొదట్లో కస్టమర్ల బలవంతం మీద తాగుడికి అలవాటుపడింది ముత్యాలు. క్రమేపీ ఆ వ్యసనం వల్లే సంపాదననీ, ఆరోగ్యాన్నీ సర్వ నాశనం జేసుకొంది. ఇంచుమించు అతని వయసుదే, కానీ అకాల వార్ధక్యం ప్రాప్తించిన దానిమల్లే ఎండి ఒరుగయి మంచాన పడింది. ఇన్నాళ్ళూ స్వర్గం పంచిన దేహం, ఇప్పుడు ఎవరికీ అక్కర్లేని పనికిరాని వస్తువు.

గత కొన్నాళ్ళుగా పరిస్థితి బాగా విషమించడంతో సాంబుడిలో ఆందోళన పెరిగింది. బేరాలు కుదిర్చినప్పుడు దక్కే కాస్త కమిషన్ డబ్బులూ ముత్యాలు బాగు కోసమే ఖర్చు చేసేడు. మందులు, కాస్తంత టీ, ఎప్పుడేనా రెండో, మూడో సారాయి పొట్లాలు. ఇంతకుమించి ముత్యాలు కూడా ఏవీ కోరలేదు.

సాంబుడికేవీ పాలు బోవడం లేదు. దాహమంటోంది. ఎవరిస్తారు డబ్బులు, ఎవర్ని వేడుకోవాలి? అప్పటికింకా టీ నీళ్ళకూడా ఎంగిలిపడని సాంబు ఖాళీ కడుపులోకి దోపుకున్న చేతుల్ని బయటికి తీసి చిరాగ్గా విదిలించేడోసారి. ఎప్పటిలానే వేశ్యాంగనలా ఒళ్ళు విరుచుకుంటోంది వీధి. శరీరపు ముడతల్ని చీర మడతల్లోకి సర్దుకొని, మెరుగులు, ముస్తాబులతో, వొత్తుగా రాసిన లిప్‌స్టిక్‌లా ఎరుపు నవ్వుని పెదాలపై దిద్దుకొని, రహస్య సైగలు చేస్తోంది. బేరాల కోసం ఎన్నో జతల కళ్ల ఎదురుతెన్నులు. ఈ మధ్యనే వృత్తిలోకి దిగిన కొందరు పడుచుపిల్లలు రెండు చేతులా సంపాయిస్తున్నారు. కడుపు కోసమే అయినా, రోజులు జెల్సాగా గడుస్తున్నాయి.

ఇక్కడి కంపెనీలకి నాయకురాలుగా చెలామణి అవుతున్న నూకాలు వీధంతా కలయజూస్తూ వస్తోంది సాంబుడి కేసి. గడప గడపనీ పలకరించుకుంటో నెమ్మదిగా కదులుతోంది. నూకాలు కూడా ఈరిగాడు వున్నాడు. వాళ్ళిద్దరికీ మంచి జత. ఈ రోజుల్లో ఎక్కువ బేరాల్ని తెచ్చి ఎక్కువ కమీషన్లు సంపాయిస్తున్నది ఈరిగాడే. ముత్యాలు ఆరోగ్యం చెడి మంచం పట్టినప్పటి నుండీ ఈరిగాడి దగ్గర, నూకాలు దగ్గర

## చిస్తున్న విషయం

పరిచయం చేసుకున్నారు.


"ప్రముఖ శాస్త్రవేత్తలు ఎప్పుడూ ఏదో శాస్త్ర విషయాలు ఆలోచిస్తూ వుంటారని విన్నాము. కాబట్టి ఇప్పుడు భోజన సమయంలో మీరు ఏ విషయాన్ని గురించి ఆలోచిస్తున్నారో చెబితే మా పాఠకులకు తెలిపి సంతోషిస్తాము" అన్నారు.

ఫ్లెమింగ్ వెంటనే "ఇప్పుడు ప్రస్తుతం నేనొక ప్రత్యేక విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాను! నిజమే!" అన్నాడు.


"అదే చెప్పండి. మేము కోరేదీ అదే" అన్నారు, ఆ ఇద్దరు పత్రికా విలేకరులు.

"ప్రస్తుతం నేను భోజనంలో, ఒక గుడ్డు తినాలా, రెండు తినాలా...!? అని ఆలోచిస్తున్నాను" అన్నాడు, మళ్లీ పత్రికా విలేకరులు మరో ప్రశ్న వేయకుండా.

—ఎం.డి.సౌజన్య







పెద్ద మొత్తంలోనే చేబదుళ్ళు తీసుకున్నాడు సాంబు. వాళ్ళు రాగానే డబ్బుల ప్రసక్తి తెస్తారు. తలకు మించిన అప్పులు - తీర్చేదెలా? ఈరిగాడు - నూకాలూ తన చేరువకి వచ్చేలోపునే చిన్న నిట్టూర్పుతో ముఖం దించుకొని రిక్షాని అక్కడే వొదిలిపెట్టి గోదావరి గట్టుకేసీ అడుగులేసేడు సాంబు. మనిషి రివటలా పొడుగ్గా వున్నాడు. వెలిసిపోయిన ఇటిక రంగు నిక్కరు. బుజాన గళ్ల తువాలు.

"రోగాలతోనూ, ఆకలితోనూ అలమటిస్తూనే చచ్చిపోద్దా ముత్యాలు?" కళ్ళు బైర్లు కమ్మినట్టు చుట్టూ చీకటి ఆవరించి తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు. ఆకలి — అవును ఆకలంటే పైకి కన్పించకుండానే నవనాడులూ దహించుకపోవడం. ఆకలి మూలాన్ని దొలిచే వేరు పురుగులా వుంటుంది. చిన్నప్పుడు తండ్రి కోపానికి భయపడి గోదావరి స్టేషన్‌లో రైలెక్కి భీమవరం పారిపోయినప్పుడే తెలిసింది ఆకలంటే ఏమిటో. మనుషుల మధ్య డబ్బు గోడలు కన్పించేయి. మనుషుల మధ్య వ్యత్యాసం. అతి ఖరీదైన చావునీ, అత్యంత హీనమైన చావునీ కళ్ళారా చూసేడు. "దగుల్బాజీ లోకం" అని పైకే గొణుక్కున్నాడు సాంబు.

"ముత్యాలు శ్వాస ఆడుతూందో లేదో?" మనసు సలుపుతోంది. జనసంచారం పల్చగా వున్న గోదావరి గట్టు రోడ్డుని పరామర్శించేడు సాంబు. పదిహేనేళ్ళ పరిచయంలో ముత్యాలు గోదావరి గట్టుకేసి షికారుకి రావటం గుర్తు లేదు అతనికి. గోదావరి గట్టుకే కాదు. బజారుకీ, సినిమాలకీ విచ్చలవిడిగా తిరిగిన గుర్తు కూడా లేదు. ఇన్నేళ్ళూ ఆ కొంపలోనే మగ్గిపోయిందన్న సంగతి చాలా మందికి తెలీదు. ఎన్నిసార్లు తను బతిమిలాడినా గడప దాటింది కాదు. "మంచి బేరం వుంది. లాడ్జీకెళ్దాం వస్తావూ?" అని ఒకసారడిగితే ఏవందనీ — "ఎవరైనా ఇక్కడికి రావాల్సిందే. నే వెక్కడికీ రాను. ఇలా పడుండనీ నన్ను" అని విసుక్కుంది. ఆ విసుగులో అహంకారం లేదు. గుండెల్లో సెగలు రేపే విచారం వుంది. ముత్యాలు మాటల్లో అంతరార్థం వెంటనే తెల్సిరాలేదు. కానీ బతుకుతెరువుని ఏకరువు పెట్టే బరువు మాటల అర్థం తెల్సింతర్వాత మరెప్పుడూ గడప దాటి రమ్మని సాంబు అడగలేదు.

ముత్యాలమ్మకి ఇరవై కాతాల

వరకు వుండేవి. ఆ రాబడితోనే కంపెనీ బ్రోకర్లనీ, పోలీసుల్నీ, డాక్టర్లనీ విలాసంగా పోషించింది. కావాల్సినంత సొమ్ము పారేసి పోలీసుల నోరు కట్టించేదేగానీ ఎప్పుడూ స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగిన పాపాన పోలేదు. తను మాత్రం ఎలా బతికేడు? ముత్యాలు దగ్గరికి వచ్చే కష్టమర్లకి సేవలందిస్తూ ఇన్నేళ్ళూ గడుపుకొచ్చేడు. రోడ్డు మీద అటూ ఇటూ తిరుగుతున్న జనాన్ని, వాహనాల్ని మరోసారి పరామర్శించేడు సాంబు. ఊబిలో కూరుకుపోయి, బతుకులా రద్దీలో నలుగుతున్న రోడ్డు.

మగాణ్ని నిలబెట్టే అందంతో మిసమిసలాడుతుండేది ముత్యాలు. నటన తెలీని మనిషి. ప్రేమతో నిలువెల్లా కరిగిపోయేది. "నాకున్న తోడల్లా నువ్వే కదరా" అని ఆప్యాయంగా చేరదీసి తనని బతుకు చెంగుకి ముడేసుకుంది. చిన్ని చుట్ట పీలికైనా దొరుకుతుందేమోనని జేబులు తడుముకున్నాడు సాంబు. ఖాళీ నిక్కరు జేబులాంటి అతని బతుకులో శూన్యపు సంచులు.

"ముత్యాలు శ్వాస ఆడుతుందో లేదో?" అనే ధ్యానంతో వెనుతిరిగేడు. మగాణ్ని నిలవరించే అందం కదూ ముత్యాలమ్మది! వీధికంతటికీ నిండుగా కాళ్ళకి అడ్డంబడే నదిలా వుండేది. కాళ్ళు తడవకుండా ఎవడైనా ఆ వీధిని దాటగలిగేడా? సాంబుడిలో పిచ్చి పాదుల్లా అల్లుకపోయిన పూర్వస్మృతులు. ఎప్పటిదో ఒక జ్ఞాపకం చితాభస్మాల్లాంటి అతని కళ్ళలో దీపాలు రాజేసింది. ముసిముసిగా నవ్వురేకులై విచ్చుకున్నాయి అతని పెదాలు. మర్చిపోయే కొద్దీ గుర్తుకొచ్చే సంఘటన.

ఎప్పుడో, వయసు వేడిలో కాలుతున్నప్పుడు ఓ రోజు: స్నానం చేసి, చీరని సగం చుట్టబెట్టుకుని అర్ధనగ్నంగా వున్న ముత్యాలుని తలుపు చాటు నుంచి వొడిసి పట్టుకొని వుక్కిరి బిక్కిరి చేస్తూ కావలించుకున్నప్పుడు — వొదలమని గింజుకోలేదు. కోపంతో కేకలేయనూ లేదు. అల్లుణ్ని చీదరించుకొన్నట్టు చీదరించుకొంటూ అంది "నువ్వూ అందర్లాంటోడివేననుకోలేదు — చివరికి నీ విషయంలోనూ మోసపోయాను. నీకూ నా శరీరమే కావాల్సి వచ్చిందేం" మాటల్లో ఛీత్కారం. నమ్మిన వ్యక్తులే వంచకులైనప్పుడు ఒక స్త్రీ భీతావహురాలై పలికే మాటల్లోని అంతర్లీన వేదన. బరువైన ఆమె గుండెలపై తడిసి అంటుకుపోయిన చీర మీద బలవంతంగా అదిమిన సాంబుడి తలలో సుళ్ళు తిరుగుతూ ఆవిర్లు.

కొద్ది క్షణాలాగి, నిశ్చేష్టుడైన అతని జుట్టులోకి సుతారంగా వేళ్ళు జొనిపి తలెత్తి కళ్ళలోకి లోతుగా చూపింది. అది క్షమాభిక్షని ప్రసా


## మీ కోసం

అతిధి రాక చూచి అదలించి పడవైచి
కఠిన చితులగుచు కానలేరు
కర్మమునకు ముందు ధర్మమ్ము కానరో!
విశ్వదాభిరామ వినురవేమ!




మీ ఆహ్లాదం కొరకు ఈ శీర్షికను సమర్పిస్తున్నవారు:

నాగార్జున ఫైనాన్స్ లిమిటెడ్
నాగార్జున హిల్స్, హైదరాబాద్-500 482. ఫోన్:228654, 37389, 228157.

Imageads-91

దించే చూపు. సాంబుడి కళ్ళు గేలానికి చిక్కుకున్న చేప పిల్లలా విలవిల్లాడేయి. మళ్ళీ అంది — "వద్దురా, నువ్వు అందర్లాంటోడివి కాదు, ఆ పని మాత్రం చెయ్యకు" కన్నీళ్ళ పర్యంతమయ్యే మాటలు, మాటల్లో వేడికోలు. అతను వ్యామోహపడిన శరీరంపై ఆమె యేవగింపు మాటలు — అతని మొరటు ప్రయత్నంపైని వెయ్యి సమ్మెటలతో మోదినట్టు.జ్వాలలు చల్లారేయి. కెరటాలు కెరటాలయి బుసలు కొడుతో వెయ్యి తలలతో మహోధృతంగా విరుచుకుపడిన కోరికలన్నీ ఏ తలుపుల్ని తెరుచు కొని వెళ్ళిపోయాయో?ఏ మార్గాల నుండి నిష్క్రమించాయో తెలీదు. పరమ కిరాతకానికి ఒడిగట్టిన అప రాధిలా తలొంచుకుని నిల్చుండి పోయేడు.

అంతటితో వూరుకుందా? చదివేసిన పుస్తకాన్ని చూసినట్టు మరలా సాంబుని తడిమి చూసిన తర్వాత — వెనుతిరిగి అదే గదిలో, అతనికి సమీపంలోనే మామూ లుగా బట్టలు.మార్చుకొంది. ఎంత సేపు నిల్చుండిపోయేడో స్పృహ లేదు. అకస్మాత్తుగా భుజాల చుట్టూ చేతులు బిగించి అదురు తున్న చెంపలపైకి గిలిగింతలు పెడుతున్నట్టు ముంగురుల్ని విదిల్చి "ఈ పూలు తల్లో పెట్టు"ని గుబాళించే మల్లెల దండని అందిం చిందతనికి.

అదే — అతని జీవితం చుట్టూ అల్లుకున్న పరిమళపు మాల.

వోరారా."ఒరే సాంబూ" అని పిల్చేది. అలా పిలవటంలో ఎంత దగ్గరితనం. "అందర్లాంటోడివి కాదురా" అనేది. ఆ మాట చాలు అతని జీవితానికి ఆసరాగా.

అడుగులు తడబడుతున్నాయి. ఇల్లింకా పదడుగుల దూరంలో వుండగానే ఈరిగాడు పిల్చేడు "సాంబూ, డాక్టరుగారొచ్చేరు."


మౌనంగా అరుగు మీదికి తొంగి చూసేడు. నూకాలు డాక్ట రుతో మాట్లాడుతోంది. గోడకి దాపుగా వేసిన తలగడ మీద జార గిలి శూన్యంలోకి చూస్తోంది ముత్యాలు — జీవం లోపించి నట్టుగా వుందా చూపు. కొడిగట్టే దీపాలవల్లే వున్న ఆమె కళ్ళలాగే ప్రాణం కూడా రెపరెప లాడు తోంది. ఇప్పుడిక 'ఆకలి, దాహ మని' కూడా మొరపెట్టడం లేదు. గత ఐదారు గంటల్లోనే ఎంతో క్షీణించినట్టుగా వుంది.

ఆమె పక్కనే ఖాళీ టీ గ్లాసుంది. టీ తాగిందేమో?

మందులు రాస్తున్నాడు డాక్టరు. తిండి సయించని ముత్యాలుకి మందులు పన్జేస్తాయా? సాంబు ఒక నిశ్చయానికి వచ్చినవాడిలా మౌనం వహించేడు. చిల్లి గవ్వలేదు — అయినా మందులు కొనాలి తప్పదు. ఆ స్థితిలో ముత్యాలుని వొదిలి వెళ్ళడానికి మనసొప్పడం లేదు — కానీ తప్పదు. ఎలాగోలా బేరం వెదకాలి. డబ్బు లోకం. వేళాపాళా ఏముందీ? ఆడది ఓరగా చూస్తే తిమ్మిరెక్కిపోతారు.లాడ్జీల చుట్టూ తిరిగితే ఒక్క బేరమేనా దొరక్కపోద్దా? పదో పరకో దొరి కితే మందులన్నా దక్కుతాయి.

ఒళ్ళంతా సింగారించుకున్న దేవిక రిక్షాలో కూర్చొంది. మధ్యాహ్నం కావొస్తోంది. మొదటి సారిగా మునుపెన్నడూ లేనంతగా భారంగా కదుల్తోంది రిక్షా. ఓపిక నశిస్తోంది. సాంబుడి చెవుల్లో ముత్యాలమ్మ మూగ కేకల అర్థింపు. ఎక్కడో అంతరాంతరాల్లో దాగిన జల ఉబికి అతని కనురెప్పల్లో తడి చేరింది. ఇప్పుడతని కళ్ళు వర్షంలో తడిసిన చితాభస్మరాశులు. ●

## ఇలా జరిగింది




### ఒడిలోని హాయి

మాక్స్‌వెల్ ఏ పని అయినా వీలైనంత వరకు యాంత్రికంగా చెయ్యటం అలవాటు. అట్లా చేస్తేగాని పనులు చకచకా కావని ఆయన ఉద్దేశం. ఆయన నాలుగేళ్ళ కూతురు రోజా రాత్రిపూట తండ్రి వొళ్ళో పడుకుని కథలు చెప్పమని పోరుతూ వుండటంతో ఆయనకు అట్లా చెప్పక తప్పింది కాదు. పాప ఆయన వొళ్ళో పడుకుని కథలు వింటూ నిద్ర పోయేది.

ఈ పద్ధతి ఆయనకి నచ్చలేదు. కాలం వృధా అవుతోందని, కొన్ని పిట్ట కథలు టేపు చేసి రాత్రిపూట ఆ పాపకి వినిపించటం మొదలెట్టాడు. టేప్ రికార్డర్‌ని ఎట్లా పెట్టాలో, కట్టేయాలో కూడా నేర్పాడు. అట్లా వారం రోజులు గడిచాక ఏదో పనిలో నిమగ్నమయివున్న తండ్రి దగ్గరకొచ్చి ఓ కథల పుస్తకం యిచ్చి 'దీనిలో కథలు చదివి వినిపించు' అంది పాప. దానికాయన "టేపు రికార్డర్ పెట్టుకుని కథ దానిలో వినొచ్చుకదా!" అన్నాడు.

"అది కథల్ని వినిపిస్తుంది కానీ, నన్ను ఒళ్ళో పడుకోబెట్టుకోలేదు కదా!" అంది.

— రిలేకరి

కోరమాండల్ సిమెంట్స్, లిమిటెడ్ వారి భీమ సిమెంట్